
# మనసుని ముసిరిన మబ్బులు



శివరాజు సుబ్బులక్ష్మి

జయకి చాలా చిరాగ్గా వుంది. అసలే తను ఎక్కింది తుని స్టేషనులో. దానికి తోడు ఎక్స్‌ప్రెస్ ట్రెయిను. అంత కొద్ది టైంలో తనూ తన సామాన్లూ ఎక్కాల్సి వచ్చింది. తనకి కాస్త సహాయ పడేందుకు ఇంట్లో ఎవరూ రాలేదు. అందుకే దుఃఖం పొంగి పొంగి వస్తోంది. అసలు తనెవరికి కావాలి? 'ఏదో వుంటు న్నావు కనక వుండు' అన్న తత్వం గల యజమానితో పాతికేళ్ళు నెట్టుకొచ్చింది. కానీ, ఇప్పుడు ఎందుకో మనస్సులో చిన్న కోరికపుట్టి బట్ట కట్టి వటువంతై ఎదిగింది. ఏమిటా కోరిక అంటే సమాధానం దొరకదు. విరక్తి.

మరో వూహకి తను చోటు ఇవ్వదు. కానీ, తన భర్త కూడా చాలా మంది భర్తల్లాగా 'ఇక నువ్వు గీసిన గీటు దాటను' అనే శపథం చెయ్యడు. తను చేసే పనికి మెప్పు అన్నమాట ఆ యింట్లో వినపడదు. ఏం చెయ్యాలి? గతంలాగే గడిపెయ్యమనే మంచిమాటకే మనస్సులో చోటు ఎక్కువైంది. శరీరం అనారోగ్యానికి లొంగి కుంగదీస్తోంది. నడివయస్సులో ఎలా వుండాలి?

'చూపులకి వుక్కుపిడుగల్లే వుందా తిండికి లోటు రాకూడదు. ఎటొచ్చీ పనికే మొండికేస్తోంది...'—అనే

తోడికోడళ్ళ ప్రేమములుకులు సూక్తుల్లా చెవిలో కాపరం పెడితే ప్రయాణం కట్టింది ఈనాడు. ఏనాడనగా వెళ్ళిందో మేనమామగారింటికి...మళ్ళీ తనకి తానుగా ఈనాడు వెడుతోంది. తన తల్లికి చెందాల్సిన ఆస్తి కూడా పెత్తల్లి స్వాహా చేస్తూ వచ్చింది ఇంతకాలం... ఎప్పుడన్నా తను ఓ కార్డు ముక్క రాయటం, ఈ ఏడు పంటలన్నీ ములిగి పోయాయి కనక పన్నులు కట్టాల్సింది అంటూ తిరిగి వచ్చిన కార్డుని ఎత్తి, పొయ్యిలో పడేసి స్తిమితపడటం, తనకి ఎన్నో సార్లు అనుభవం...

కాని, ఇప్పుడు ప్రళయం లాంటి మార్పు వచ్చింది ఆమెలో. ఆవిడని ఇంట్లోంచి వెళ్ళగొట్టినంత హంగామా చేసేశారుట ఆవిడ కూతుళ్ళు...అమాంతం ఆవిడలో వైరాగ్యం పుట్టుకొచ్చింది.. 'ఎక్కడి బిడ్డలు...ఎక్కడి పాపలు...' అంటూ బట్టలు చింపుకొంటూ బజారున పడి, రామాలయంలో దేవుడి నెత్తిన చెయ్యెట్టి ప్రమాణం చేసేసిందిట...

'నా చెల్లెలిపిల్లకి అన్యాయం చేసేశాను గనక నా కడుపున పుట్టిన వాళ్ళు నాకు కాకుండా పోయారు. ఈనాడు...ఇదీ నాకు మంచిదే, లేకుంటే, ఇంకా ఈ సంసారం పట్టుకు ఏడుస్తోవుండేదాన్ని.. అని చెప్పేసిందిట అందరికీ.

"అన్యాయం జరిగిపోయిన ఆ పిల్లకి ఈనాటినించీ భూమి అప్పచెప్పేస్తున్నా నంటూ రచ్చబండ యెక్కి, రంకెలేసి పొలిమేరదాటి పుట్టింటికి చేరిందట. సెంటు భూమి కూడా మిగల్చని మామయ్య బ్రహ్మానందపడిపోయి 'మా అప్పవి...రావే' అంటూ ఆహ్వానిం చాడుట. ఆ సంగతులు అన్నీ మెరుగులు దిద్ది వ్రాతమూలకంగా తెలియపరిచిన పెత్తల్లి అల్లుడు అసలు ఆస్తిని అమ్మకం పెట్టేశాడుట. తను వెడుతోందే గానీ, తనకి ఎంత వస్తుందో తెలియదు. తనే మని అడగాలి? అసలు తన తల్లికి ఎంత చెందుతుందో కూడా తెలీదాయె!... అనుకుంటూ తన సామాన్లని అటూ యిటూ సర్దుతూ తన గొడవలో తనుంటే ఎదుటి సీటులో కూర్చున్న అమ్మాయి "మీ చెంబులోంచి కాసిని నీళ్ళు తీసి ఇవ్వండీ!" అంటోంది. ఎన్నాళ్ళనుంచో ఎరుగున్నట్టు మాట్లాడుతూంది. నీళ్ళు ఇవ్వకూడదనిపించినా, అమ్మాయి చనువు చూస్తే తీసుకు తాగేస్తుందేమో అన్న అనుమానం తోచింది.

అయిష్టంగానే కంచుచెంబు తెరిచి గ్లాసులో నీళ్ళు పోసి యిచ్చింది. అమ్మాయి జుత్తుతో ఆడుకుంటున్నట్టు వుంది గుర్రపుజూలులా మొహమ్మీద పడిన జుత్తుని పైకి విసురుకుంటూ, మళ్ళీ ముందుకు తీసుకుంటూ, నల్లటి పెది మల్ని నాలికతో తడుపుకొంటూ, ప్రక్కనే కూర్చున్నాయన్ని సతాయి స్తోన్నట్టు పైకి కనపడుతోంది.

సామర్లకోట రావటంతో పెట్టెలో జనం అంతా ఒక్కసారి దిగిపోయారు! ముందు ఖంగారుపడ్డా, ఈ పెట్టె అడంగుకి చేరుస్తుందన్న ధైర్యం, ఎదుటి సీట్లో వున్న వాళ్ళని కనుక్కున్నాక వచ్చింది. ఖాళీఅయిన పెట్టెలోకి వో నలుగురు ఎక్కి, ఖాళీగా వున్న చోట తిష్ఠ వేశారు. తన సీటులో తను నడుం వాల్చింది. ఎదటి సీటు అమ్మాయి ఎందుకో ఏడుస్తోంది...

"చూడండీ, నన్ను అర్థాంతరంగా విడిచేసి వాడు ఆత్మహత్య చేసుకుంటా డుట..."అంటోంది.

'వీడు' అంటుందేమిటి? భర్త కాడా? అర్థం కాలేదు.

''నాకు సోదరుడిలాంటి వాడు... నా పుట్టుకకి ముందే మా రెండు కుటుం బాల వాళ్ళూ స్నేహంగా వుండే వారట" అంటూ అడక్కుండానే తన కథని చెప్పేస్తోంది...

"నాకు పిల్లల్ని చూడాలని వుందంటే —ససేమిరా వొప్పుకోవటం లేదు. మీరు చెప్పండి? పిల్లలమీద ప్రేమ వుండదా? —తల్లికి!" అని ఆవురుమంది.

ఆ అబ్బాయి చూపులో పులికళ్ళు మెరిసాయి. మొహంలో గంభీరత. ఆవిడని అమాంతం పట్టుకుని పడుకో బెట్టేశాడు.

"ఒద్దు. ఒద్దు. ఒదిలెయ్యి. ఇంక మాట్లాడను. ఆ సీసా తీసి నాకు ఎన్ని ఇవ్వాలని వుంటే—అన్నీ పడెయ్యి... మింగేసి నిద్దరోతా..."—అని ఆమె అనటంలో మనిషిలోని దైన్యం బైట పడ్తోంది.

"పోసింది-ఒదిలేయండి ... పాపం, ఏదో దిగులు పడుతున్నారల్లే వుంది..." అంది జయ.

"అబ్బే. అదేం లేదండీ. ఆవిడకి కాదు. నాకు. ఖర్మ! చెయ్యలేక చస్తు న్నాను. ఇప్పుడంటే ఇప్పుడు వదిలి పోగను. కానీ, దీని ముఖాన్ని ఎవ్వరూ చూడరు. అన్నిందాలా అధ్వానమైన జీవితం గడుపుకోమనండి." అంటూ తనపైకి సానుభూతిని తిప్పుకోవాలని తాపత్రయపడుతున్నాడు.

"నా పేరు గోవర్ధనం. నన్ను 'గోవా' అనే పిలుస్తారు. మా నాన్న చేసిన అన్యాయం నా జీవితాన్నే నాశనం చేస్తే—ఈ మహా విద్వాంసురాలు నన్ను నన్నుగానే కాల్చేస్తోంది...ఈవిడకి, నిజంగా పిల్లలంటే ప్రేమ అను కుంటున్నారేమో...అదే పొరబాటు. వాళ్ళని భరించలేక ఈవిడ దేశం పట్టుకు తిరుగుతుంది. ఈమాత్రం పాడే వాళ్ళు బోలెడుమంది వున్నారు. ఈవిడ అందర్నీ పట్టుకు, తనే వెళ్ళి పాడి వస్తూ వుంటుంది. అలా అని ఈవిడ బాగా డబ్బున్నదని అనుకునేరు. నా దగ్గర వున్న డబ్బుని ఎల్లా ఖర్చు పెట్టించాలో మాత్రం బాగా తెలుసు..."




అతి మెల్లిగా చెప్తున్న అతని మాటలకి అడ్డు వొచ్చింది.

"ఏమిచేమిటీ? మళ్ళీ చెప్పు...నాకు డబ్బు లేదూ? నా మేడ చేస్తుంది వో లక్ష. నా నగలూ అవీ చూస్తే ఈవిడ కళ్ళు తిరిగి పడుతుంది... కాదులే అమ్మా, మాట వరసకి చెప్తున్నా. మావాళ్ళు అసలు జమీందార్లు...మా నాన్న భోగాల రాయుడు అవటం వల్ల చాలా హరించి పోయినా మిగిలింది ఇంకా రెండు దశాబ్దాలదాకా కూర్చొని తినొచ్చు...పోనీ నీదేమన్నా యిస్తున్నావా?" అంది.

"ఇ టు చూ డూ, ఇ వ్వ లే దూ?" అంటూ కళ్ళు గుచ్చినట్టు చూశాడు

ఆ చూపులకి ఆ అమ్మాయి భయపడ్డట్టు అనిపించింది. ఆ అబ్బాయి మాటలు కూడా జాలి పుట్టిస్తున్నాయి. ఏవో పచ్చవీ, ఎర్రవీ, నీలంవీ కలిపి వో గుప్పెడు మాత్రలు మింగేసింది ఒక్కసారిగా. ఆ అబ్బాయి మరచెంబు తీసేసుకుని నీళ్ళు పట్టించాడు. ఆవిడ అటు తిరిగి పడుకుంది. అతను కూర్చున్నాడు.

కాస్సేపు నిశ్శబ్దం. స్టేషన్లు వస్తూ వెడుతూండగానే చీకటి పడింది. ఆ అమ్మాయి చూస్తూ వుండగానే నిద్దర్లోకి జారిపోయింది.

"ఇదో చెడ్డ అలవాటు. ఇప్పుడు పెద్దవాళ్ళ మనుకొనే వాళ్ళంతా ఈ అలవాటుకి దాస్యం చేస్తున్నారు. పాట కచ్చేరీలు వున్నప్పుడు ఎల్లాగో వుగ్గపెట్టుకు వూరుకుంటుంది. అది అవగానే ఇదే వరస...ఆ కట్టుకున్నవాడు ఉన్నాడు...మీరు చెవుతే నమ్మరు కానీ, ఈవిడని గొడ్డుని బాదినట్టు బాది, మంచాన పడేస్తూ వుంటాడు. అదే తగిన పద్ధతి లెండి!" అంటున్నాడు గోవా.

అంత నిద్దర్లో చివాలున లేచి కూర్చుంది.

"ఏమిటి అంటున్నాడూ, వీడూ? మా ఆయనికి ఇష్టం లేదూ? కొడతాడా? ఎవడురా నన్ను కొట్టి బతికేదీ? వాడినీ వీడినీ కూడా కలిపి చంపుతా. నా భర్త ఎంత మ ం చి వా డ నుకున్నావూ... నన్ను ఎంతో ముద్దుగా చూసుకుంటాడు. నా సాధనకి ఎంతో తోడ్పడతాడు. నా పాటకి ప్రాణం పెడతాడు. అయితే, ఏం అతనికి కళ్ళు పోయాయి...అందుకే ఈ గోవాగాడి తోడు...ఆ అలుసు తీసుకు వాగుతాడు. పాపం, మంచివాడే వీడూనూ...వాడికి సృష్టిలో వున్న ప్రతి స్త్రీకి ఏదో వొకటి అంటగట్టి ఆనందించే స్వభావం అలవడింది. వాడికి ఈ జన్మకి పెళ్ళి అవుతుందన్న నమ్మకం నాకు లేదు. ఎటొచ్చీ వీడికి వున్న కాస్త డబ్బూ కరక్కుండా దానికి ఆశపడ్డది కట్టుకుని, వీడికి సమాధి కట్టేస్తుందే-అని-అదే నాకు బెంగ!" అనేసి మళ్ళీ పడుకుండి పోయింది.

అతను పెదిమ విరిచాడు.

"ఆ మాత్రల ప్రభావం! తెల్లారి అప్పుడే ఓ అరడజను సార్లు మింగి వుంటుంది. ఈ వరసని ఒక్కర్తీ ప్రయాణం చేస్తే వంటినున్న ఆ సొమ్ములు కాస్తా ఎవరైనా తీసేసుకుంటారు...అందుకే నా సర్వస్వం ధారపోసి ఇంత చేస్తున్నాను. నేనంటే ఇష్టమే లెండి...నేను లేకపోతే ముద్ద కూడా నోట పెట్టదు. అందుకే నేనూ కట్టుబడి వుండిపోయా...ఈ మధ్య నాకోసం వో అమ్మాయి ఆత్మహత్య

చేసుకోబోతే ఎంతో శ్రమపడి నా అసమర్థతని చెప్పుకొని నాతో ఏకీభవించేట్లు చేసి ఆవిడని బతికించాను. నేనే గనక పెళ్లి చేసుకు వెళ్తాననుకోండి... ఈవిడ మరునాడు ఈలోకాన్ని విడిచేయటం తథ్యం. ఎందుకంటారా? లెఖ్ఖ లేకుండా గుప్పెడేసి మాత్రలు మింగేస్తే బతుకుతుందా? నేను కాబట్టి కొన్ని చక్కెర మాత్రలు కలిపి అన్నీ గుచ్చెత్తి ఇచ్చినట్టు పిచ్చెక్కిస్తున్నా"-అని చెపుతున్నాడు.

ప్లాట్‌ఫారమ్ మీదిలైట్లు పెట్టెల్లో పడి మనుష్యుల్ని వెతుకుతున్నాయి.

"రాజమండ్రీ వచ్చేసిందే..." అంటూ జయ బైటికి తొంగి చూస్తోంది.

ఏదో పళ్ళబండీ వెడుతోంది. దూరంగా కాఫీ వాసనా, ఫలహారాల వాసనా వేస్తోంది. జయకి ఏదన్నా తినాలనిపించిఁది. కిందికి దిగబోయింది. 'ఏదైనా తెచ్చిపెట్టనా?' అన్నాడు గోవా.

"ఏది వేడిగా వుంటే అది కావాలి. కాఫీ బాగుంటే ఇందులో పోయించండి" అంటూ గ్లాసు అలదించి, చిల్లర లేకపోవడంతో పదిరూపాయిలనోటు తీసింది. చేతులోంచి అందేసుకు గోవా వెళ్ళి పోయాడు. ఆ చొరవకి జయ తెల్లబోయింది.

రైలు కదిలేముందు ఓ కుర్రాడి చేత ఓ పొట్లం పట్టించుకు వొచ్చి, కాఫీగ్లాసు అందిస్తూ "మీకు నేను వచ్చాక చెప్పుకుంటాను..." అని తొందర పెట్టాడు.

"సరే, చిల్లర లేకేగా, ఇందాక పది నోటు యిచ్చా" అంటూ మరో పది పైకి తీసింది.

''అది ఇల్లా ఇవ్వండి అదీ ఇదీ మీకు నేను ఇచ్చుకుంటాను" అంటూ చెయ్యి కదుపుతూ కంగారు పెట్టేస్తున్నాడు.

జయ ఈసారి చేతిలోది అందనివ్వటంలేదు. అతని వెనకనుంచి వచ్చే స్త్రీ మూర్తిని చూసి మొహం తిప్పేసుకున్నాడు. ఆవిడ కూడా అతన్ని చూసి, మొహం చిట్లించుకుంటూ, సామాన్లతో పెట్టెలోకి చేరింది. గోవా బైటనుంచి డబ్బు ఇమ్మని ప్రాధేయ పడుతున్నాడు. ఈసారి జయే ఇచ్చేసింది మరో పది. ఇచ్చిన మరుక్షణం నుంచీ జయ మనస్సులో బాధ. 'ఇదేమిటీ, ఇంత తెలివి తక్కువ పని... వెధవ తిండి కోసం ఇరవై రూపాయలు వొదులుకుందా తనూ' తీరా తను వెళ్ళాక అనుకూలంగా లేకపోతే_ తను ఇబ్బంది పడాలేమో! అయినా మరో ముప్ఫయ్ తీసి రహస్యంగా జాకెట్లో దాచుకున్నది. వుందో లేదోనని తడిమి చూసుకుంది. తన సీట్లో కూర్చుని ఫలహారం ఏం వుందోనని పొట్లం విప్పి చూసుకుంది. 'వేడిలేదు, వాడి బొందాలేదు' అనుకుంటూ విప్పిన పొట్లం బైటికి విసిరేసింది. కాలుతూన్న కషాయంలాంటి కాఫీ మాత్రం తాగి కూర్చుంది.

రైలు కదిలే గుర్తుగా వోసారి కుదిపి ముందుకి వురికింది. గోవా బండి ఎక్కలేదు ఏమయ్యాడోనని ఆత్రంగా చూసింది...ఆవిడ మాత్రం బట్ట పైకి జరిగింది కూడా చూసుకోకుండా నిద్ర రోతూంది. కొత్తగా బండి ఎక్కినావిడ పడుకున్నావిడని ఎగాదిగా చూస్తూ మెటికలు విరుచుకుని జయపైన విసురుగా మాట్లాడటం మొదలెట్టింది.

జయకి అర్థం కాలేదు.

"ఏమంటున్నారూ?" అని నిలేస్తే, "వీళ్ళు మీకు తెలుసా?" అంటూ ఎదురు ప్రశ్న వేసింది.

"ఆఁ తెలుసు..." అంటూ వుసూరుమంది ఆవిడ.

"ఆ అబ్బాయి మంచివాడేనా? ఈ కాస్సేపటి పరిచయంతోనే నా దగ్గర ఇరవై వుచ్చేసుకున్నాడు. మళ్ళీ ఇస్తాడా?'' అంది ఆత్రంగా.

"ఏమో మీకే తెలియాలి...మా ఇంటాయన కట్టుకున్నదానికి కాణీలు లెక్కెంచి ఇస్తాడు. వాడి వాగుడికి దాసుడైనాడు అనుకోండి... లేనిపోని పోకిళ్ళు మప్పివో సంచీ గుంజేశాడు... వీడు? ఇదుగో - దీని పాట అంటూ వాడు కొంప కొంపా తిరిగి డబ్బు వసూలు చేసి వీళ్ళకి వాళ్ళకీ తంపులెడుతో, వీధి భాగోతుల్లా వూళ్ళమీద పడి బతుకుతున్నారు. దీనికసలు బుద్ధీ జ్ఞానం వుంటేగా?'' అంటూ రొప్పుతోంది.

"ఏమోనండీ.. ఆ అమ్మాయి స్పృహలో వున్నప్పుడు పిల్లల్ని చూడాలంటూ ఏడుస్తోంది. మొగుణ్ణి మెచ్చుకుంటోంది. కానీ ఈ అబ్బాయి ధోరణి నాకు నచ్చలేదు. తనేదో సర్వస్వం ఒదులుకున్నానంటాడు...! అసలు ఇష్టం లేకపోతే ఆవిడ వెనక ఎందుకు తిరుగుతున్నాడూ?" అంది జయ.


"వాడిని మొదట ఈవిడ తన చుట్టూ తిప్పుకుంది.. వాడసలే వికారపు బుద్ధి గలవాడు. కాబట్టి వాడిప్పుడు ఈవిణ్ణి గుప్పెట్లో పెట్టేసుకున్నాడంటున్నారు. నాకూ సరిగ్గా తెలీదు. ఎటొచ్చీ మీకూ వాళ్ళకీ సంబంధం, దొంగ మాటలు చెప్పి పట్టుకెళ్ళిన డబ్బు..." అని వూరుకుంది.

"మరి, నా మాట కూడా అంతేనేమో..." అంది జయ.

"మీరెల్లా యిచ్చారండీ?"అందావిడ.

ఇంతలో పడుకున్నావిడ లేచి కూర్చుంది. తన మెళ్లో లాకెట్టు లేదని గోల చేసి వెతుక్కుంది. 'గోవా.. గోవా...' అని అరిచింది.

"వాడేడీ... వాడి పనే...ఇంతేనండీ.



వాడికి ఇదే పిచ్చి. బంగారం బతక నివ్వడు. ఎవరి దగ్గర డబ్బున్నా వాడికి చేరిపోవాలి. వాడు చేసిన అప్పులన్నీ తీర్చలేక చస్తున్నా, వీడికి మిగిలినగుణా లన్నీ రత్నాల్లాంటివే — ఈ బుద్ధి పాడు చేస్తోంది..." అంటూ వూడిన చీరని ఈడ్చుకుంటూ బాత్‌రూమ్ వేపు నడుస్తోంది. అంతలో మళ్ళీ వెనక్కి తిరిగింది. మధ్యలో కూర్చుని..."వాడువస్తే నేను లేనని చెప్పెయ్యండి నాకు నా కొడుకుని చూడాలని వుంది. ఇటునుంచి దిగి, వెళ్ళిపోతాను..." అంటూ కింద పాకుతోంది. గూడెం స్టేషన్లో దిగింది. కాఫీ తెచ్చిన కుర్రాడు వొచ్చి వాళ్ళ సామాన్లు పట్టుకెడుతున్నాడు.

జయ గోవాకోసం చూస్తోంది. వాడు దూరంగా దీప స్తంభం వెనక్కి జరిగి నిల్చున్నాడు. జయ వదలకుండా, గార్డుకి చెప్పి వాడిని పట్టుకోమంది. అతని నమ్రతా, అతని బట్టలూ, అతని వాచీ చూసిన గార్డు నీళ్ళు నమిలి, విజిల్ వేస్తూ ముందుకి నడుస్తున్నాడు.

జయ గోవాని తిట్టడం మొద్దలు పెట్టింది. ప్లాట్‌ఫారం మీద వున్న కొద్ది మందీ పోగయ్యారు. ఇంతలో గోవా కీనీడకి జరిగి పోయాడు.

రైలు వెడుతూనే వుంది. జయ మనస్సు స్థిమితం తప్పినట్టు వుంది. ఇందాక ఎక్కిన ఆడది నోరు తెరుచుకు నిద్ర పోతూంది. ఏవో చిన్న స్టేషన్లు

వస్తూ పోతూనే వున్నాయి. పవర్ పేటా, ఏలూరు అంటూ అరుపులు వినబడ్డా బైటికి చూడ బుద్ధి కాలేదు...బెజవాడ చేరేసరికి పొద్దు పోయింది... 'ఈ జనం ఈ రైళ్ళూ సద్దుమణగవు' అనుకుంటూ రైలు దిగింది జయ. తనతో కూడా, ఆవిడా దిగింది. దూరంగా గోవా దిగాడు. వాడి వెనకనే ఆ అమ్మాయి... మరో నలుగురు, సినిమాల్లో రౌడీల్లాంటి వాళ్ళు తూలుతూ నడుస్తున్నారు. గోవా అటూ ఇటూ చూస్తూ, వెన్ను విరుచుకు ముందుకి నడుస్తున్నాడు. అటు చూసేందుకు జయకి భయమేసింది. దిగిన జనం వెనకాల పడి బైటికి చేరింది. కూడా వచ్చినావిడని ఆరాలు తీసి తను వెళ్లాల్సిన చోటూ అక్కడే అని తేల్చుకుంది. ఇద్దరూ కలిసి వెళ్ళారు. వెతుక్కుంటూ ఇల్లు చేరేసరికి సగం రాత్రి గడచిపోయింది. కూడా వున్న ఆవిడని తనవాళ్ళ ఇంట్లోనే వుండమంది. ఆవిడ కూడా ఎక్కువ మొహమాటం పడకుండా, వుండిపోయింది.

పెత్తల్లీ, పినతల్లీ, మేనమామా, మొదట ఎందుకొచ్చావన్నట్టు చూసినా, తరవాత తెల్లారే దాకా ముచ్చట్లు చెప్పుకున్నారు. మర్నాడు పొద్దున్నే జయతో వచ్చినావిడకి కాఫీ పెట్టించి సాగనంపారు.

పెత్తల్లీ, మేనత్తా ముచ్చట పడిపోయి సినిమా ప్రయాణం పెట్టారు. జయకి జ్వరం వొచ్చినట్టున్నా, సర్దా చంపేయటం ఇష్టం లేక బయలుదేరింది...సినిమా హాల్లో గోవా ఎదురైనా ఎరగనట్టు వూరుకున్నాడు. జయ పెత్తల్లి నోరు పెద్దది...

"త్రాష్టమల్లే ఎక్కడ చూసినా, వాడి రూపేనే...హవ్వ! నీకు దక్కాల్సినదీ, నాకు మిగలాల్సినదీ. వాడి ఎదాన పెట్టాను కదే-" అంటూ నోరు నొక్కుకుంది.

జయకి అర్థం కాలేదు.

"అదేనే నా మనమరాలు పార్వతిని ఇచ్చి కట్టబెట్టాంగా..."అంది.

"అదేమిటి...అతని పేరు కామేశం అని విన్నట్టు గుర్తు..." అంటూ జయ వెర్రిమొహమేసుకుని, సీట్లు వెతుక్కుంటూ లోపలికి వెళ్ళింది.

"వాడే వీడు సర్వమంగళం పాడించి, ఏదో ఎస్టేటు వున్నట్టూ, అందరికీ చెప్పుకు తిరుగుతాట్ట. అసలు అదేంకాదు. వాడు ఒకర్తిని చేరదీసి, దాని సంసారంవో కడకి తెస్తున్నాట్ట! నా మనవరాలికి పిచ్చి అంటూ పేరెట్టి, దాన్ని రెచ్చగొట్టి, చచ్చేటట్టు కొట్టి, నిద్ర మాత్రలు మింగించి మింగించి పొట్టనెట్టుకున్నాడు. ఇహ- ఇప్పుడు ఆస్తికి హక్కుదారుణ్ని అంటూ కోర్టుకెక్కాడు. నా అల్లుడిరోగం కుదురుతోందిలే—బాగానే వుంది గానీ, వాడికి ముట్టడం నాకు గిట్టకే నీకు రాయించా. వాడికిచ్చేకంటే-నీకే చెందడం మంచిదని, నీ అప్పకూడా అంటోంది...మరేమంటారో..." అనేసి సినిమా చూడసాగింది పెత్తల్లి.

జయకి ఆ మాటలూ, ఆ కధా అంతా అయోమయంగా వుంది. తన భర్తకి ఈ కిటుకులూ, కుట్రలూ తెలియవు. పొద్దున్నే లేవటం తను ఏది చేసిఇస్తే అదే అమృతంలా తిని, త్రాగి వెళ్ళిన మనిషి మళ్ళీ మిల్లు కూతకి మేలుకుని అన్నానికి రావటం. పుష్టిగా తిని ఓ కునుకు తియ్యటం. మళ్ళీ కొట్లో కూర్చోటం... అంతే తెలుసు. తను కూడా, ఇంటిపట్టున వుండి, అవీ ఇవీ సవరిస్తూ పొద్దు పుచ్చటం. అప్పుడప్పుడు పొరుగు వాళ్ళతో పోటీపడి, నగలు కరిగిస్తూ, చేయిస్తూ ముచ్చట్లు పడిపోవటం...ఇంతే పరిమితి. తోటికోడలూ, తనూ కలిసి పేరంటం... ఎవరింటికి వాళ్ళు చేరటం... అంతే—అలాగే ఏళ్ళు తిరిగి పోయాయి.

వయస్సు మళ్ళిపోయింది. కానీ పెత్తల్లి జీవితమే సినిమా కధట...అమ్మ చెప్పేది. ఇప్పుడు అలాగే కూతుళ్ళ జీవితాలు భారతాలైతే-మనవరాలి బతుకు డిటెక్టివ్ కథలా వుంది... అనుకుంది జయ.

అంతలో దీపాలు వెలిగాయి.

ఆ అమ్మాయి వెనక సీట్లో కూర్చొని ఏడుస్తోంది..."వాడేడీ... నా గోవా... వాడు లేకపోతే నేను చచ్చిపోతాను!" అంటోంది. ఎవరో—ఎర్రటిది గాజు గ్లాసులో పోసి పట్టిస్తున్నారు.


"ఇది. .వొద్దండీ! అసలు వాడు లేకపోతే నాకు తోచదు. అదీ కాదు. నా గొలుసు అడిగి పుచ్చుకోండీ...వాడు దుర్మార్గుడు... తెలిసిందా?" అంటూ వెనక్కి వాలిపోయింది.

"అంతేనండీ..."అంటూ వాడి మాట చీకట్లోంచి వినపడుతోంది.

"అంతేలే! దీనికీ మా పార్వతికి పట్టింది పట్టబోతోంది...ఎటొచ్చీ వాడికి ఇది వుంటే తప్ప నాలుగు రాళ్ళు మిగలవు. అంచేత చంపడు. చచ్చినట్టు వుంచుతాడు. అదే వాడి నేర్పు. మన పార్వతి కూడా వాడిని ఒక పల్లెత్తుమాట అననిచ్చేదా? అబ్బే. ఇరుగూ పొరుగూ ఏడ్చేవాళ్ళు...దీని గతీ అంతేనే-చూస్తోవుండు. దీనికి పిల్లలూ మొగుడూ, కొంపాగోడూ వున్నాయిట...అక్కడ వుంటే దీన్ని ఎన్ని ఆంక్షల్లో వుంచుతారో లెక్కలేదుట...అయినా, ఇది ఇంతేనుట...అందరిలో వాడిని నానా మాటలు అంటుందిట. దానితో సగం చచ్చి దాని మొహాన మాత్రలు పడేసి వీడు ఆనందిస్తాడల్లే వుంది..."అని అంటూంటే సినిమా సమాప్తమైంది.

జయ తన ఇరవై రూపాయలమాట పెత్తల్లి చెవిలో వూదింది.

"ఆ దబ్బుకి ఇంక తిలోదకాలు




వొదులుకో—వాడింక ఏకేం యిస్తాడు?" అని తేల్చేసింది.

పెత్తల్లీ, పినతల్లీ కలిసి వాడికి ముట్టకుండా వుండేందుకు తాపత్రయపడి అల్లుడిదగ్గర జయకి కొంత డబ్బు రాపట్టి, రైలు ఎక్కించేందుకు వెళ్ళారు కాని, జయకి వచ్చిన డబ్బుకన్నా, తను పెంచుకున్న కొబ్బరి చెట్లపై వొచ్చిన డబ్బు అపురూపం అనిపించింది. ఆ డబ్బే వాడు కాజేశాడు. ఎందుకో కళ్ళు చెమర్చాయి... దూరంగా కృష్ణా నది హోరు పెడుతూన్న చప్పుడూ నీలంగా అగుపించే దూరపు కొండలు, మురికాలవల పక్కన మెరిసిపోయే దీపాల వెలుగుల్లో ఖరీదైన బట్టలు వేలాడేకొట్ల వరస...అన్నీ చూస్తూ స్టేషనుచేరింది. పెత్తల్లి కళ్ళు వొత్తుకుంది. మేనమామ హుందాగా నిల్చుని చూస్తున్నాడు.

గోవా బందరు బండీ ఆగేచోట నిల్చున్నాడు. ఓ అమ్మాయి బంటి నిండా నగల్తో హాయలు పోతోంది. పాపం, అనుకుంది జయ...పోనీ తను చెప్పినా ఆ అమ్మాయి వినొద్దూ అని సమాధానపడింది. వాళ్ల అన్యోన్యతని చూ స్తూ న్న కొద్దీ తట్టుకోలేసుకొస్తూనే వుంది జయకి. తన డబ్బు యిచ్చేయమని అడగాలనుకుంది. 'ఇంకెక్కడి మాటలే' అనుకొంటూనే వెళ్లింది. కొత్త అమ్మాయికి బోలెడు కథలు అల్లి చెప్పేస్తున్నాడు. తనకి అందరూ తెలుసుట. మంత్రులంతా తన భృత్యులేనట. ఒకటేమిటి–అన్నీ అబద్ధాలూ వాగి చివరికి ఓ ఆయిదు వందలు వుంటే కావాలనీ, రాజమార్గమే తనకి యిష్టమనీ ఉపదేశించే సమయానికి– ఆ పిల్లని కట్టుకున్నవాడు రాక్షసి మాయలా వచ్చి వాలాడు.

''నిజమే పాపం, వయస్సు మళ్ళిన ఈయన ఆ పిల్లకి భర్త కావటం పొరబాటే చేశాడు...ఆ పిల్ల తన అందం దేశానికి అప్పచెప్పకేంచేస్తుందిచెప్పండీ?'' అంటూ గాయకురాలు పట్టుచీర సవరించుకొంటూ పలుకులు వల్లిస్తోంది.

గోవాగాడు టెర్లిన్ పేంట్‌కేసి చూసుకొంటున్నట్టు కనపడుతూనే ఆపిల్లని తన దాన్ని చేసుకుంటున్నాడు. ఆ అమ్మాయి అరణ్యవాసానికి వెళ్ళే సీతమ్మవారిలా, వొంటినున్న నగలన్నీ వొలిచి భర్త చేతిలో పెట్టి–'నీకో నమస్కారం'అంది. తెరపై నాయకుడిలా మనవాడు మొహం ముడుచుకుని ముందుకు పోయాడు. రైలు వొచ్చింది. వెళ్ళింది. పాపం, ఆ అమ్మాయి దీపపుసెమ్మెలా నిల్చునివుండిపోయింది.

తను ఎక్కాల్సిన రైలు కూత పెట్టింది. జయ పరుగు పరుగున వెళ్లి పెట్టె ఎక్కింది.

ఇప్పుడు జయ మనసుని ముసిరిన మబ్బులు కదిలిపోయాయి

